

ఖైరతాబాద్ ప్రధాన రహదారిలో ఇలా తవ్వి వదిలేయడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.


నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, గురువారం 13 ఫిబ్రవరి 2025 | HYDERABAD




షేక్‌పేటలో రోడ్డు పక్కనే వ్యర్థాలు పేరుకుపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులుపడుతున్నారు. పరిసరాలు దుర్గంధంగా మారుతున్నాయి.

## కష్టపడి చదివితేనే.. లక్ష్యాన్ని చేరుకోగలం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : కష్టపడి చదివినప్పుడే అనుకున్న ఫలితాలు సాధించవచ్చని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సికింద్రాబాద్ ప్రభుత్వ ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కోటాజీ, ఆర్డీఓ సాయిరాం, ఏఎస్ డబ్ల్యూ మోహన్, హాస్టల్ వార్డెన్ మనోహర తదితరులు పాల్గొన్నారు.

## అపరిచితులు చాక్లెట్లు ఇస్తే తీసుకోవద్దు

జూబ్లీహిల్స్: పాఠశాలకు వచ్చే సమయంలో విద్యార్థులకు అపరిచితులు చాక్లెట్లు ఇస్తే తీసుకోవద్దని.. ఈ సమాచారాన్ని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు వెంటనే తెలియజేయాలని యాంటీ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలకు దగ్గరగా ఉన్న పాన్ షాప్‌లు, కిరాణా షాప్‌లలో డ్రగ్స్ సంబంధిత చాక్లెట్లు, ఇతర వస్తువులు అమ్మితే ప్రహరీ కమిటీకి, 1098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు పి. పరమేశ్వరమ్మ ఎస్ సీ హెచ్ వోగా నలుగురు ఉపాధ్యాయులు, విద్యార్థులతో కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్‌ను తరిమి కొడతామని ప్రతిజ్ఞ చేయించి ..ఉపాధ్యాయులతో కలిసి యూసుఫ్‌గూడ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు.



## గ్రేటర్@35.4

సిటీబ్యూరో, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఎండలు ముదురుతున్నాయి. దీంతో నగర వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. పగటి ఉష్ణోగ్రతలు 35డిగ్రీలు దాటడంతో ఉక్కపోత అప్పుడే చెమటలు కక్కిస్తోంది. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 35.4డిగ్రీలు, కనిష్ఠంలు 20.6డిగ్రీలు, గాలిలో తేమ 29 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రానున్న వారం రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు 40కి చేరువ కానున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.



# మూసీలో మళ్లీ కూల్చివేతలు

### భయాందోళనలో పరీవాహక ప్రాంత ప్రజలు

### మూసానగర్‌లో మొండి గోడలను జేసీబీతో కూల్చివేత

### అడ్డుగా ప్రహరీ కట్టేందుకే ఈ కూల్చివేతలంటున్న ఎమ్మెల్యే బలాల

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/మలక్‌పేట, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): బుల్డోజర్ వచ్చిందంటే చాలు.. మూసీ పరీవాహక ప్రజలు గజగజ వణికిపోతున్నారు. ఏ క్షణాన ఎక్కడ కూల్చివేతలు మొదలవుతాయోనని ఆందోళన పడుతున్నారు. బుధవారం ఉదయం చాదర్‌ఘాట్ పరిధిలో జేసీబీతో కూల్చివేతలు చేపట్టడంతో ఇతర ప్రాంతాల్లోని కాలనీవాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అధికారులు సైతం వీటిపై స్పష్టత ఇవ్వకపోవడంతో అసలు ఏం జరుగుతుందోనని అందరినీ వాకబు చేస్తున్నారు. అయితే గతంలో చేపట్టిన కూల్చివేతలకు సంబంధించి ఇంకా మొండి గోడలు ఉండటంతో బాధితులు తిరిగి తాత్కాలిక నివాసాన్ని ఏర్పాటు చేసుకుంటారనే అనుమానంతో ఈ కూల్చివేతలు చేపట్టారని కొందరు చెబుతున్నారు. కానీ అధికారులు మాత్రం ఈ విషయాన్ని ధ్రువీకరించడం లేదు. దీంతో కూల్చివేతలు మొండి గోడలకే పరిమితం అవుతాయా? అది పూర్తయిన కొత్త నిర్మాణాల వైపునకు వస్తాయా అనే దానిపై అధికారులు పెదవి విప్పడం లేదు.

### మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అంటేనే..

మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అంటేనే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని పరీవాహక ప్రాంత ప్రజల గుండెల్లో రైళ్లు పరుగెడతాయి. ప్రాజెక్టులో భాగంగా గతంలో భారీ ఎత్తున కూల్చివేతలు చేపట్టేందుకు సర్వే చేసి, మూసీ రివర్ బెడ్ పరిధిలో 2,166 నిర్మాణాలు, బఫర్‌జోన్‌లో 7,851 నిర్మాణాలతో పాటు 200 వరకు ఓపెన్ స్పేస్ ఉన్నాయని తేల్చారు. ఆ మేరకు చాదర్‌ఘాట్ పరిధిలోని మూసానగర్, ఓల్డ్ మలక్‌పేట పరిధి శంకర్‌నగర్ పరిధిలో సుమారు 150 వరకు కుటుంబాలు నివాసముంటున్న ఇండ్లను కూల్చివేశారు. అంబేద్కర్ హట్స్, సాయిలు హట్స్, అజయ్ హట్స్ ప్రాంతాల్లో 109 వరకు గుడిసెలను గుర్తించారు. వీటిల్లో 26 వరకు గుడిసెల్ని కూల్చివేశారు. ఆ సందర్భంగా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో పాటు బీఆర్ఎస్ కూడా



కూల్చివేతల్ని వ్యతిరేకించి.. బాధితులకు అండగా నిలిచింది. దీంతో ప్రభుత్వం కూల్చివేతల ప్రక్రియను నిలిపివేసింది. బాధితులకు చంచల్‌గూడ పిల్లి గుడిసెలు, వనస్థలిపురం, ప్రతాపసింగారం, ఇజయాగూడ ప్రాంతాల్లో కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతానికి కూల్చివేతలు నిలిచిపోయాయని పరీవాహక ప్రాంత ప్రజలు కాస్త కుదుటపడ్డా... ఏక్షణాన బుల్డోజర్లు వస్తాయోనన్న భయం మాత్రం ఉంది.

### ఆగుతాయా? కొనసాగుతాయా?

చాదర్‌ఘాట్ పరిధిలోని మూసానగర్‌లోకి అధికారులు బుధవారం జేసీబీ సహా వచ్చి కూల్చివేతలు మొదలుపెట్టారు. దీంతో మళ్లీ మూసీ పరీవాహకంలో కూల్చివేతలు మొదలయ్యాయంటూ మీడియా, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. దీంతో పరీవాహక ప్రాంత ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. చాలామంది తమ పనులు వదులుకొని ఇండ్ల వద్దకు వచ్చారు. మూసానగర్‌లో గతంలో కొంతమేర కూల్చివేయగా మిగిలిన మొండి గోడలు, శిథిలమైన నిర్మాణాలను పూర్తిగా కూల్చివేసే పనులు మొదలుపెట్టారు. అయితే కొంత సేపటికి జేసీబీలో సాంకేతిక సమస్యతో పనులు నిలిపివేశారు. అయినప్పటికీ కూల్చివేతలను ఇంకా కొనసాగిస్తారా? గతంలో కూల్చివేసిన వాటికే పరిమితం చేస్తారా? అనే దానిపై అటు రెవెన్యూ ఇటు ఎంఆర్‌డీసీఎల్ అధికారులు నోరు విప్పడం లేదు. కాగా దీనిపై 'నమస్తే తెలంగాణ' మలక్‌పేట ఎమ్మెల్యే బలాలను సంప్రదించగా.. గతంలో అసంపూర్తిగా కూల్చివేసిన వాటిని పూర్తిగా తొలగించి, శిథిలాలను అక్కడి నుంచి తొలగించేందుకు ఈ పనులు చేపడుతున్నట్లు చెబుతున్నారు. తదుపరి ఆక్రమణలకు గురికాకుండా ఉండటంతో పాటు ఇతర కాలనీవాసులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌డీసీఎల్ అధికారులను తాను కోరానని ఈ క్రమంలో రూ.3.60 కోట్లతో ఈ పనులు పూర్తి చేయడంతో పాటు అడ్డుగా గోడ కట్టనున్నట్లు చెప్పారు. మరి మరోవైపు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మూసీ సుందరీకరణపై తాము ముందుకే వెళతామని అనేకసార్లు ప్రకటించింది. ఇందులో భాగంగా బఫర్‌జోన్‌లోని నిర్మాణాలను కూడా తొలగిస్తామని అంటున్నది. ఎమ్మెల్యే బలాల చెబుతున్నట్లు రివర్ బెడ్ వరకు అడ్డుగా గోడ కడితే తదుపరి బఫర్‌జోన్‌ను ఎలా స్వాధీనం చేసుకుంటారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

## ఆ ఇల్లు నాకే అమ్మాలి.. లేదంటే!

### సైదాబాద్‌లో నయీం అనుచరుడినంటూ.. ఓ వ్యక్తి బెదిరింపులు

సిటీబ్యూరో/సైదాబాద్, ఫిబ్రవరి 12(నమస్తే తెలంగాణ): అపార్ట్‌మెంట్ ఫ్లాట్ అమ్మేయాలంటూ సైదాబాద్‌లోని కరణ్‌బాగ్‌లో నివాసముంటున్న మిర్చి వ్యాపారి ప్రకాశ్‌రెడ్డిని నయీమ్ అనుచరుడుగా చెప్పుకునే శ్రీహరి అనే వ్యక్తి రెండేళ్లుగా బెదిరిస్తున్నారని ప్రకాశ్‌రెడ్డి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రకాశ్‌రెడ్డి భార్య అనురాధ బుధవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం తమ ఫ్లాట్ అమ్మాలంటూ శ్రీహరి కుటుంబం ఎన్ని సార్లు బెదిరించినా వినకపోవడంతో ఈనెల 9న శ్రీహరి తన కుటుంబసభ్యులతో కలిసి ప్రకాశ్‌రెడ్డి ఇంటికి వచ్చి ఆయన కుటుంబంపై దాడి చేశారని ఆమె పేర్కొన్నారు. తాను నయీం అనుచరుడినని, తనకు హత్యలేం కొత్తకాదని, ఇల్లు తనకు అమ్మకుంటే చంపేస్తానని, అట్రాసిటీ కేసులు పెట్టి జైలుకు పంపుతానని బెదిరించినట్లు తెలిపారు. ఒక నెల రోజులు గడువు ఇస్తున్నానని, ఈలోగా ఇల్లు తనకు అమ్మేయాలంటూ బెదిరించి వెళ్లారని, శ్రీహరి, ఆయన కుమారుడితో తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని అనురాధ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోవైపు శ్రీహరి కొడుకు రాజేంద్రప్రసాద్ కూడా ఈనెల 11న సైదాబాద్ పోలీసులకు ప్రకాశ్‌రెడ్డి కుటుంబంపై తమను కులం పేరుతో దూషించారని, దాడి చేశారని ఫిర్యాదు చేశారు. ఇరుపక్షాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారని, కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సైదాబాద్ పోలీసులు తెలిపారు.



మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

## సెలబ్రిటీ క్రికెట్ లీగ్‌కు పటిష్ట బందోబస్తు

### రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): సెలబ్రిటీ క్రికెట్ లీగ్-2025 టీ20 మ్యాచ్‌లకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు వెల్లడించారు. పదకొండో సీజన్ సెలబ్రిటీ క్రికెట్ పోటీలు ఈ నెల 14, 15వ తేదీల్లో ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు క్రికెట్ మ్యాచ్ నిర్వాహకులు, ఆయా ప్రభుత్వ విభాగాలతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మ్యాచ్ సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ఆట చూసేందుకు వచ్చే ప్రేక్షకులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు.

## ప్రజా సమస్యలపై పోరాడాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్పొరేటర్లు ముక్తకంఠంతో ప్రశ్నించాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో బుధవారం జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్ నగర అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని విమర్శించారు. అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రజలకు అండగా నిలబడి సమస్యల పరిష్కారం కోసం జీహెచ్‌ఎంసీ, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. ఈనెల 17న మరోసారి నిర్వహించే సమావేశంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీ చేసే విషయంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, సురభి వాణీ దేవి, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, మర్రి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు చెల్లించలేదని.. ప్రిన్సిపాల్ మందలింపు

### శ్రీ చైతన్య విద్యార్థిని ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ మృతి

మేడ్చల్, ఫిబ్రవరి 12: పెండింగ్ ఫీజు చెల్లించలేదని ప్రిన్సిపాల్ అందరి ముందు మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ విద్యార్థిని ఆత్మహత్మకు యత్నించింది. చికిత్స పొందుతూ చనిపోయింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మేడ్చల్ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్లో కమల, వెంకటేశ్వర్లు దంపతుల కుమార్తె అఖిల (16), కుమారుడు విక్రమ్ పదో తరగతి చదువుతున్నారు. వారిద్దరి ఫీజు రూ.90వేలు చెల్లించాల్సి ఉంది. అందులో రూ. 10 వేలు చెల్లించారు. మిగితా మొత్తం చెల్లించడంలో తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు. విక్రమ్ మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో చికిత్సకు డబ్బులు వెచ్చించాల్సి రావడంతో ఫీజు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నెల 8న అఖిల పాఠశాలకు వెళ్లగా ప్రిన్సిపాల్ రమాదేవి తోటి విద్యార్థుల ముందే టెన్త్ పరీక్షలు వచ్చాయని, ఫీజు చెల్లించాల్సిందేనని గట్టిగా మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన అఖిల స్కూల్ నుంచి ఇంటి వరకు ఏడుస్తూ వచ్చింది. తల్లిదండ్రులకు ఈ విషయం చెప్పకుండా తెలిసిన వారితో ఫీజు కోసం తనను ప్రిన్సిపాల్ మేడం టార్చర్ చేస్తున్నారని చెప్పుకొని కన్నీరుపెట్టింది. తిరిగి పాఠశాలకు వెళ్తే అవమానం తప్పదని భావించిన అఖిల.. సోమవారం నుంచి పాఠశాలకు వెళ్లలేదు. మంగళవారం తల్లి ఇంట్లో ఉండగానే అఖిల వేరే గదిలోకి వెళ్లి గడియ వేసుకుంది. ఎంత సేపటికీ బయటికి రాకపోయే సరికి తల్లి కమల పక్కన ఉన్న కిటికీలో నుంచి చూడగా, అఖిల ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్టు గుర్తించింది. వెంటనే ఇరుపొరుగు సహాయంతో డోర్ ను బలవంతంగా తెరిచి, కిందికి దించారు. అప్పటికే అఖిల పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానికంగా ఉన్న ఆస్పత్రిలో ప్రాథమికంగా చికిత్స చేయించారు. అయితే పరిస్థితి విషమించడంతో అదే రోజు సాయంత్రం యశోద ఆస్పత్రికి తరలించారు. బుధవారం సాయంత్రం చికిత్స పొందుతూ అఖిల మృతి చెందింది. అంతకుముందు ఉదయం అఖిల తల్లి పాఠశాలకు వెళ్లి.. ప్రిన్సిపాల్‌తో పాటు యాజమాన్యాన్ని నిలదీశారు. తన కూతురు ఉరేసుకోవడానికి మీరే కారణమంటూ.. కన్నీరుపెట్టుకున్నారు. రెండేండ్ల నుంచి తన పిల్లలు ఈ పాఠశాలలో చదువుతున్నారని, కొద్ది రోజుల కిందట కొడుకు విక్రమ్‌కు ఇంగ్లిషులో మార్కులు తక్కువగా వచ్చాయని, ఇబ్బంది పెట్టడంతో మానసికంగా దెబ్బతిన్నాడని ఆరోపించారు. పాఠశాలకు కూడా రావడం లేదన్నారు. అతడిని చూసుకునేందుకు తాను ఉద్యోగం మానేసినట్లు చెప్పారు. ఉద్యోగం మానేయడం, వైద్యం కోసం డబ్బులు ఖర్చు చేయాల్సి రావడంతో సరైన సమయంలో ఫీజులు చెల్లించలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు చెల్లించేందుకు రుణం తీసుకుంటున్నామని, రాగానే మొత్తం చెల్లిస్తామని కూడా ప్రిన్సిపాల్‌కు చెప్పామన్నారు. ఆర్థిక పరిస్థితి బాగలేక ఒక విద్యార్థి ఫీజు చెల్లించకపోతే నష్టం వస్తుందా అని ఆమె ప్రశ్నించారు. ఇక్కడ ఫీజు కోసం టార్చర్ పెడుతున్నారని, పేద తల్లిదండ్రులు ఇలాంటి పాఠశాలల్లో తమ పిల్లలను చదివించి, తమ బిడ్డలను చంపుకోవద్దని కోరారు. కాగా, ఎస్ఎఫ్ఐ నేతలు పాఠశాల ముందు బైఠాయించి..యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని.. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, నిర్వాహకులు వివరణ ఇస్తూ.. తాము అఖిలను వేధించలేదన్నారు. అందరితో పాటు తనకు ఫీజు చెల్లించాలని గుర్తు చేశామన్నారు. అవమానకరంగా మాట్లాడలేదని చెప్పారు. గత ఏడాది ఫీజును ఈ నవంబర్‌లో పూర్తి చేశారని, ఈ ఏడాది ఫీజు ఇద్దరు పిల్లలకు కలిపి రూ. 10 వేలు మాత్రమే చెల్లించారని వివరించారు. మూడు రోజుల నుంచి స్కూల్ కు రాలేదని, తమకు విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు మంగళవారం రాత్రి తెలిసిందన్నారు. యాజమాన్యానికి జరిగిన విషయాన్ని వివరించామని ప్రిన్సిపాల్ రమాదేవి, రీజినల్ ఇన్‌చార్జి చక్రి తెలిపారు.



## ఎస్‌ఆర్ గాయత్రిలో

### అనుమానాస్పదస్థితిలో విద్యార్థిని మృతి

దుండిగల్, ఫిబ్రవరి 12: ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని ఎస్ఆర్ గాయత్రి కళాశాలలో అనుమానాస్పద స్థితిలో మరణించింది. వివరాలు ఇవీ..సూర్యాపేట జిల్లా కిష్టాపురం గ్రామానికి చెందిన బైసు శ్రీనివాసరావు, దేవి దంపతులు బోరబండలో నివాసముంటున్నారు. వీరి రెండో కుమార్తె పూజిత(18) బాచుపల్లి లోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీ, గర్ల్స్ క్యాంపస్ (ఎస్ఆర్ గాయత్రి) కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. బుధవారం ఉదయం బ్రేక్ ఫాస్ట్‌కి రాకపోవడంతో హాస్టల్ ఇన్‌చార్జి..పూజిత ఉంటున్న గదిలోకి వెళ్లి చూడగా, ఉరివేసుకొని కనిపించింది. వెంటనే సిబ్బంది స్థానిక మమత వైద్యశాలకు తరలించారు. అప్పటికే పూజిత చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించడంతో మృతదేహన్ని గాంధీ వైద్యశాలకు తరలించారు.అయితే ఎస్ఆర్ కళాశాల యాజమాన్యం తమ కూతురు చనిపోయిన విషయాన్ని దాచి తమకు తప్పుడు సమాచారం ఇచ్చిందని, తమకు తెలియకుండానే మృతదేహన్ని గాంధీకి తరలించిందని తల్లిదండ్రులు ఆరోపిస్తూ.. కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. కళాశాల ప్రిన్సిపాల్ నిరూపరెడ్డిని పిలవాలని డిమాండ్ చేయడంతో పోలీసులు ఆమెను కళాశాల వద్దకు తీసుకొచ్చారు. ఈ క్రమంలో పూజిత ఆత్మహత్యాయత్నం చేయగా, వైద్యశాలకు తరలించినట్లు తప్పుడు సమాచారం ఎందుకు ఇచ్చారని ఆమెపై దాడికి యత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో ఆందోళనకారుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో క్లూస్ టీం పోలీసులు హాస్టల్ గదిలోకి వెళ్లి ఆధారాలు సేకరించారు. పోస్టుమార్టం నివేదిక వస్తే తప్ప.. పూజిత మృతిపై నిర్దిష్టంగా తామేం చెప్పలేమని పోలీసులు పేర్కొన్నారు.




